

# నీడ

వాడ్రేవు వీరలక్ష్మీదేవి

**విశాలమైన ఆవరణలోంచి నడుచుకుంటూ వచ్చి పెద్దగేటుదాటి రోడ్డుమీదకొచ్చాను. ఆమూల నించి ఈమూల దాకా సాగి వ్యాపించి ఉన్న నిర్మానుష్యమైన రోడ్డు. నాలుగడుగులు నడవగానే ఎదురుగా పెద్ద కానుగచెట్టు. ఆకుపచ్చటి ఆకులు దట్టంగా. కిందకీ చల్లటి నీడగా. అక్కడ ఆగేను. అప్పటికి ఊపిరి సలిపింది.**

లోపల ట్రెనింగ్ క్లాస్ జరుగుతోంది. ఆ ప్రశ్నలకి, వాటి సమాధానాలకి ఊపి రాడ లేదు. హింసించబడుతున్న స్త్రీలను ఎలా ఆదరించాలో చెప్పే శిక్షణ. అలాంటి స్త్రీలకు ఆశ్రయమిచ్చే ఆర్గనైజేన్ నడుపుతున్న శిక్షణ. అటువంటి ఒక హోమ్‌కోసం, దాన్ని నడపడంకోసం ట్రెనింగ్.

బయట ఎండ మండిపోతోంది. లోపలి అంత పెద్ద ఆవరణలో ఒక్క చెట్టయినా లేదు. మొక్కలతో, పూలమొక్కలతో చిన్న తోట మాత్రం ఉంది. లాన్స్, కాలిబాటలు బారులు తీరి ఉన్నాయి.

ఈ చెట్టుకింద ఎంత చల్లగా ఉంది. మధ్యాహ్నపు వడగాలి వీచింది. అయినా చెట్టు దానిలో తన ప్రాణవాయువును నింపి నామీద చల్లినట్టయింది.

లోపల ట్రెనింగ్ హాల్లో నిప్పులు కురుస్తోంది. వేడి. ఉక్క. అయినా తనని ఉక్కిరిబిక్కిరి చేసినవి అవి కానేకావు. "మన హోమ్ నడపడానికి కావలసిన ముఖ్య లక్షణాలేమిటి?" ఆర్గనైజర్ మూర్తిగారు అడుగుతున్నాడు.

"రకరకాలుగా హింసలు అనుభవిస్తున్న స్త్రీలకు రక్షణ ఇవ్వడానికిసార్" నిర్మల చెప్పింది. నిర్మల స్థానికంగా ఉన్న బ్యూటీ క్లినిక్‌లో బ్యూటీషియన్.

"మేడమ్! మీరు నా ప్రశ్నను తప్పుగా అర్థం చేసుకున్నారు. హోమ్ నడవడానికి మన ఆర్గనైజేషన్‌కి ఏ లక్షణాలు ఉండాలి? అని అడుగుతున్నాను" అంటున్నాడు. గడుసుగా ఉంది నవ్వు.

"మనందరి మధ్య ఐక్యత ముఖ్యమండీ!" జ్యోతి చెప్పింది.

"యస్. అదే నేను చెప్పబోయేది. యూనిటీ ముఖ్యం. విజయగారూ! మీరింకోటి చెప్పండి" అన్నాడు నాకేసి తిరిగి.

ఇప్పటికి ఈ సంస్థ ప్రారంభోత్సవం చేసుకుని ఏడాది అయింది. మీటింగ్స్ జరుగుతున్నాయి. ఎవేర్‌నెస్ కోసం మీటింగ్స్ అవి. ట్రెనింగ్ క్లాసుల్లో అప్పుడే రెండోది ఇది.

చెప్పిన మాటలే చెప్పుకుని, అడిగిన ప్రశ్నలే అడుగుతూ కాలయాపన. వేరే దేశం నుంచి లక్షల రూపంలో హింసిత స్త్రీల కోసం విరాళాలు వస్తూనే ఉన్నాయి. నివేదికలు వెళ్తూ ఉన్నాయి. కానీ, ఏరీ బాధిత, పీడిత, తాడిత వనితలు?, అదే అడిగేను.

"మనం తలుపులు తెరిచి ఉంచేం. ఎవరూ రాకపోతే మనమేం చేస్తామండి. ఇళ్లకి వెళ్లి తీసుకురాలేంకదా!" మూర్తిగారే ఇలా మాట్లాడగలడు.

"ఇళ్లకి వెళ్లే పరిస్థితి లేదుసార్. కానీ ఈ ఉదయం కాలేజ్‌లో ఇంటర్ చదువుకునే అమ్మాయి ఉరిపోసుకుని చచ్చిపోయిందనీ, సెలవనీ, మా అమ్మాయి కాలేజ్ నించి ఇంటికొచ్చేసింది. ఆ అమ్మాయి ఎందుకు చచ్చిపోయిందో తెలుసా. షెల్టరు లేక. 'ఆశ్రయం', 'నీడ'- అది లేక. "ఎందుకు జరిగిందిలా? మీకేమీ తెలీదా?" అని మా అమ్మాయిని అడిగేను. అది చెప్పిన మాటలు విన్నాక నాకు ఎంతో సిగ్గనిపించింది. తల్లి చచ్చిపోయిందిట, తండ్రికి మరో స్త్రీతో సంబంధం అని తెలిసి. మేనమామలు ఆశ్రయమిచ్చినట్టే ఇచ్చి రేప్ చేసారు తండ్రి పట్టించుకోడు. ఆ పిల్ల ఏం చేస్తుంది? ఏడాది నుంచి మన హోమ్ నడుస్తోందని మనం అనుకుంటున్నాం. కానీ నీడలేక, దొరక్క ఈరోజు ఈ పిల్ల చచ్చిపోయింది. నిజంగా మనం మన హోం తరఫున ఉండవలసిన లక్షణాలేమిటో ఇప్పటికీ తెలియడంలేదుసర్" నాలోపలి దుఃఖం ఆవేశంగా మారి బయటికి కొంచెం వాడిగా వచ్చినట్టుంది.

ఆయన వెంటనే ముఖ భావం మార్చేసాడు.

"అరెరె! మనకి ముందుగా తెలిసుంటే ఎంత బావుండేది" అంటూ నొచ్చుకుంటున్నాడు.

"తెలియవలసింది మనకి కాదు సార్! ఆ అమ్మాయికి. అలాంటి ఎందరో అమ్మాయిలకి, అమ్మలకి, తల్లులకి, వాళ్లు చచ్చిపోనక్కరలేదని, వాళ్లకి ఇక్కడో ఆశ్రయం ఉందని, అదీ, అదీ తెలియవలసినది"

"అదేమిటండీ కొత్తగా మాట్లాడతారు? మనం కరపత్రాలు పంచిపెట్టేం. లోకల్ పేపర్స్‌లో వచ్చింది. చైతన్య శిబిరాలు నడుపుతున్నాం. ఇంకేం చెయ్యాలి. చెప్పండి మీరే" జ్యోతి అందుకుని నన్ను ఎటాక్ చేసింది.

ఇవన్నీ నాకు తెలుసు. ఆమె నాకు కొత్తగా గుర్తు చెయ్యనక్కరలేదు. అయినా ఆ పిల్ల చచ్చిపోయింది. ఆ పిల్లకి ఇక్కడ హోం ఉందని తెలియకనా? తెలిసే చచ్చిపోయిందా? అలా అయితే ఆ చావుకి మనందరం జవాబుదారీ కాదా?

ఇలా అడిగితే నేను అతిగా ఆలోచిస్తున్నానంటారు వీళ్లంతా. కానీ నిజమే కదా! నీ గురించి మితంగానూ, ప్రపంచ క్షేమం గురించి అతిగానూ ఆలోచించకపోతే, ఆలోచించలేకపోతే ఎందుకిలాంటి గేవరింగ్స్? థింకింగ్స్? నాన్సెన్స్ టాకింగ్స్! యూజ్‌లెస్ ఆన్సరింగ్స్?!

"ఒక బాధిత స్త్రీల ఆశ్రయ కేంద్రం నడుస్తున్నచోటనయినా కొన్ని ఆత్మహత్యలు తగ్గాలి. అదొక్కటే కొలత" అన్నాను.

ఎవరికీ నచ్చలేదు. కానీ పెదవి విరుపు కూడా కనపడకుండా జాగ్రత్తపడ్డారు.

ఊళ్లో చదువుకున్న మేధావులు, పలు రకాల ఉద్యోగులు కలసి చేస్తున్న కార్యక్రమం ఇది. ఇందులో లాయర్లు, డాక్టర్లు కౌన్సిలింగ్ చేస్తున్నవాళ్లు, లెక్చరర్లు అన్ని రకాలవాళ్లూ ఉన్నారు. నేనన్నమాట ఎవరికీ నచ్చినట్లు లేదు.


"జరుగుతున్న ఆత్మహత్యలు ఆగాలంటే వ్యవస్థలో ఎంతోమార్పు రావాలి. ఆ మార్పుకోసం,ఆ ఎవేర్‌నెస్‌కోసం 'కేంప్స్' నడుపుతూనే ఉన్నాంకదా!" రాధారాణి స్థానిక డిగ్రీ కాలేజీ లెక్చరర్. ఆమె స్త్రీల సమస్యల మీద ఉపన్యాసాలు చెప్తుంటారు. మంచి వక్తగా పేరుంది. శ్రోతలు బాగా స్పందిస్తారు.

"వ్యవస్థలో మార్పుకోసం మనం చేస్తున్న ప్రయత్నాలు పదోవంతుగా ఉంటే ఆ సమయంలో అది రెట్టింపు విషపూరితంగా అయిపోతూ ఉంది. ఈ విషయం మన అందరికీ తెలుసు. ఏమండీ సరస్వతి గారూ!" అన్నాను. సరస్వతిగారు ఏమీ మాట్లాడేరుకారు. కళ్లజోడు ఓమాటు తీసి కర్చీఫ్‌తో తుడుచుకుని మళ్లీ కళ్లకి పెట్టుకున్నారు. వాతావరణంలోని వేడికి ఈ వేడి కూడా తోడయినట్టయింది. వాళ్లెవరికీ ఈ చర్చని పొడిగించాలని లేదు. ఇంతలో టీలు, బిస్కట్లు వచ్చాయి. అవి సర్వ్ చేయడంలో డిస్ట్రబెన్స్. ఇద్దరూ, ముగ్గురుగా విడిపోయి కబుర్లలో పడిపోయేరు.

నాకు రెండునెలల క్రితం జరిగిన విషయం ఇక్కడ మాట్లాడాలని ఉంది. ఆ సంగతి అందరూ మర్చిపోయేరు. ఒకసారి జ్ఞాపకం చెయ్యాలనీ, దాని పరిణామాలు చెప్పాలనీ ఉంది. అందుకే ఈ చర్చ, వివాదం లేవదీసేను. ఆరోజు రమణ ఇక్కడికి రాకపోతే, ఆ టైంకి మేరీ ఇక్కడ ఉండి ఉండకపోతే నాకుకూడా ఈజ్ఞానం కలగకపోను.

** ** **

హోం నడపడానికి ముఖ్యంగా కావలసింది కేర్‌టేకర్. ఆమెను అపాయింట్ చేసుకుంటే ఈపాటికి హోంలో పదిమంది అయినా చేరి ఉండేవారు. "కానీ ఎన్నిసార్లు



పత్రికా ప్రకటన ఇచ్చినా మనకి కేర్‌టేకర్ పోస్టుకి ఎవరూ రావడంలేదు." శర్మగారు ఆ ఉదయం మీటింగ్‌లో కలిసినపుడు విచారంగా అన్నారు.

ఆయన విచారించడానికి ఒక కారణం ఉంది. అలాగే ఇంత అర్జంటుగా ఈ ఉదయం ముఖ్యమైన మెంబర్లం కలవడానికి కూడా పెద్ద కారణమే కళ్ల ముందుకొచ్చి నిలబడింది. ఆ కారణంపేరు మేరీ. పద్దెనిమిదేళ్ల పిల్ల. పాచిపనులు చేసుకుంటూ కాలం గడుపుతోంది. ఫర్వాలేదు. హింసితురాలు కాదుకదా! మరి మన దగ్గిరికెందుకొచ్చినట్టు?!

పద్దెనిమిదేళ్ల మేరీ పరికిణీ, ఓణీ వేసుకుంది. నైలాన్ ఓణీలోంచి పరికిణీ కుచ్చెళ్లు పరుచుకున్నట్టు చేసే పెద్ద కడుపు. ఆ దుస్తుల్లోంచి ఆ కడుపు అసహజంగా ఉంది. పరికిణీ ఓణీల అమాయకపు పిల్లకి తెలీకుండానే రాత్రికి రాత్రికి గర్భం వచ్చేసినట్టు. తెల్లవారిలేచి తన ఎత్తుపొట్ట చూసుకుని ఆ పిల్ల బెంబేలెత్తిపోతున్నట్టు. ఆ పిల్లని అలా చూస్తే కడుపులో తిప్పింది నాకు మాత్రం.

ప్రశ్నలు. అన్నివేపులనించీ అందరూ ఒకేసారి. ఆ పిల్లకి ఎటు తిరిగి సమాధానం చెప్పాలో తెలియనంతగా. 'కౌన్సిలింగ్' అన్న పదం ప్రజల్లోకి ఎలా ప్రవేశించిందోకాని ఎవరికి వారు కౌన్సిలర్లే. ఇంతలో ఎవరికో దయ కలిగింది. కిటికీ తలుపుకి ఆనుకుని, మూలకీ ఇరుక్కుని నించున్న ఆ పిల్లని స్టూల్ జరిపి కూర్చోమన్నారు.

అందరికీ విషయం తెలుసుకోవాలన్న ఉత్సుకత. తమ దయనీ, జాలినీ అయాచితంగా కురిపించెయ్యాలన్న తపన.

నాలుగిళ్లలో పాచిపని మధ్య ఏ ఇంట్లోనో ఎవరో పెద్ద మనిషో, కుర్రాడో ఆ అమ్మాయి నిగనిగకి నిలవలేకపోయారట. పేరు చెప్పడం లేదు. వివరాలు కూడా.

"రేప్ చేసేరా?" ప్రశ్న.

ఆ పిల్లకాదంది. నిద్రపోతుంటే వచ్చి పక్కన పడుకుని నెమ్మదిగా... నిద్రమత్తులోంచి మరో మత్తులోకి పోయినట్టు తనకి తెలుసునంటోంది. తర్వాతతర్వాత తనకే కావాలనిపించిందని చిరునవ్వుతో చెప్తోంది. తెల్లని పలువరుస తళుక్కుమంది.

నల్లని మేరీ చెంపలు నున్నగా మెరిశాయి.

సూదిగా కొనతేలిన ముక్కు కాకపోయినా చిన్న ఒంటిరాయి ముక్కుపుడక వల్ల చూడాలని అనిపించేదిగా ఉంది. కళ్లు చురుగ్గా, చూపులు సూదిగా గుచ్చుతూ ఉన్నాయి. వింత ఆకర్షణ ఉంది పిల్లలో. అదీకాక నిజాయితీ. నిబ్బరంగా విషయాలు చెప్తోంది. అమ్మానాన్నా కులాంతర వివాహం. గొడవలు పడి విడిపోయేరు. అమ్మలేదు. తనని కొంతకాలం పెంచిన నాన్న తెలిసిన ఇంట్లో పనికి కుదిర్చి చేతులు దులుపుకున్నాడు. జ్ఞానం వచ్చినప్పటినుంచి పని మనిషి బతుకే.

"రాత్రిపూట ఎక్కడ పడుకునేదానివి?" మరో ప్రశ్న. నలుగురిళ్లల్లో చేస్తున్నానుకదండీ. ఒక్కొక్కవారం ఒక్కొక్కరి ఇంట్లో. ఆరి డ్రాయింగ్‌రూంలో కింద పడుకుంటానండి. మూడిళ్లవాళ్లు మంచోరేనండి. ఒక్క ఇంట్లోనే ఇలా జరిగింది.

"ఇంకా ఆ ఇంట్లో పనిచేస్తున్నావా?"

"మొన్నమొన్నటి దాకా చేసేనండి. నా సంగతి చూసి పని మానెయ్యమన్నారు. ఆళ్లకీ తెలుసండి. ఆళ్లు పురుడు పోస్తారని నేను ఆశపడ్డానండి. నాకీబిడ్డకావాలండి. నేను పెంచుకుంటాను."

నేను తెల్లబోయాను. పద్దెనిమిదేళ్ల ఈ పిల్లకి ప్రపంచం ఏం తెలుసు? పిల్లకావాలంటోంది. ఎలా పెంచుతుంది? ఎవరు గౌరవిస్తారు? ప్రపంచంలోని దుర్మార్గం తెలియకపోవడం వల్ల ఒక్కొక్కసారి మనుషులు ఎంత స్వచ్ఛంగా ఉండగలుగుతారు? ఈ పిల్లకి తల్లిని కాబోతున్నానన్న ఆనందం ఎంత ధైర్యాన్నిచ్చింది? అనుకున్నాను.

ఆమె 'ఆ' సుఖాన్ని కాదనలేదు. వ్యక్తుల్ని నిందించడంలేదు. పిల్లకావాలంటోంది. కానీ బయటి ప్రపంచం ఆమెను బతకనిస్తుందా?

"ఇప్పుడు నీకు మానించి కావలసిన సహాయం ఏమిటి?" శర్మగారు అందరి ప్రశ్నలూ ఆపుచేసి చివరికి తేల్చబోయారు.

"తొమ్మిదోనెల వచ్చేసిందిగదండీ. ఇంక గదులు ఒత్తడం, బట్టలు ఉతకడం చెయ్యలేకపోతున్నానండి. అంట్లయితే తోమగలను. ఆ ఒక్కపనికీ అయితే కుదరదంటున్నారండి. అంచేత నాకు పురుడుపోసి మూడోనెల వచ్చేదాకా నన్నిక్కడ ఉంచుకుంటే ఆ తర్వాత ఆ పిల్లని తీసుకుని వెళ్లిపోతాను."

"ఎలా పెంచుతావు పిల్లని?"

"పాచి పనులున్నాయిగదండీ! పిల్ల పుట్టగానే ఆపరేషను చేయించేసుకుంటానండి"

అందరం ఒకరి మొహాలొకరు చూసుకున్నాం. ఈ అమ్మాయికి ఇదంతా స్వంత బుద్ధా? ఎవరేనా చెప్పి పంపేరా? అందరి మొహాల్లోనూ సందేహాలు.


దాని వయసుకున్న పరిజ్ఞానాన్నిమించి ఆ పిల్ల మాట్లాడుతోంది. మేమంతా నలభయిలు దాటినవాళ్లం. ఈ తోడేళ్లలోకం యొక్క కొన్ని ముఖాలయినా గ్రహించగలిగినవాళ్లం. మా హృదయాలలో జాలి కలగాలి ఆమె అమాయకత్వం పట్ల.

"మళ్లీ ఏ ఇంట్లోనేనా ఎవరేనా నిన్ను పూర్వంలా చేస్తే నీకు రక్షణ ఏదీ?" సరస్వతిగారే అడిగేరు. అందరి మనసుల్లోనూ ఉన్న ప్రశ్న అది.

"అందుకే పిల్లను కందామనుకున్నానండి. నా పిల్ల నాపక్కలో ఉంటుందండి. నేనుకూడా ఎటూపోకుండా పిల్లతోనే ఉంటానండి."

దాని వయసుకున్న పరిజ్ఞానాన్నిమించి ఆ పిల్ల మాట్లాడుతోంది. మేమంతా నలభయిలు దాటినవాళ్లం. ఈ తోడేళ్లలోకం యొక్క కొన్ని ముఖాలయినా గ్రహించగలిగినవాళ్లం. మా హృదయాలలో జాలి కలగాలి ఆమె అమాయకత్వం పట్ల.

కలిగిందని నేననుకున్నాను. కానీ నా అంచనా తప్పు. "అమ్మా! నువ్వు నాలుగు




రోజులు పోయేక రా! అప్పుడు ఏ సంగతీ చెప్తాం" అన్నారు పెద్దలు.

ఆ అమ్మాయి వెళ్లకుండా నిలబడింది.

ఈలోగా మాకేసి తిరిగి మనకి సరిఅయిన కేర్‌టేకర్ దొరకలేదుకదండీ! ఇప్పుడు ఈ కేసు ఎలా డీల్ చేస్తాం? ఈ అమ్మాయికి కనీసం నాలుగు నెలలయినా షెల్టరు ఇవ్వాలి. పైగా ఆ అమ్మాయిలో హెరాస్‌మెంట్ తాలూకు ఛాయలు ఎక్కువగాలేవు. మన హోమ్ హెరాస్ట్ ఉమెన్‌కి తప్ప పూర్ ఉమెన్‌కోసం కాదుకదా!" అని సరస్వతిగారి అభిప్రాయం కోసం ఆగేరు.

సరస్వతిగారు కళ్లజోడు తీసి కొంగుతో తుడుచుకుని తిరిగి కళ్లకి పెట్టుకున్నారు. నిశితంగా ఆ అమ్మాయికేసి చూసేరు. నిదానంగా ఇలా అన్నారు.

"ఈ అమ్మాయి అన్నీ నిజాలు చెప్తున్నట్టు లేదు. మనం ఒకసారి ఆ పిల్ల పనిచేసే ఇళ్లకి వెళ్లి వాకబు చేద్దాం. ఆ ఇళ్ల వాళ్లమీద నేరం నెడుతోంది. అది నిజం కాకపోవచ్చు. బయట ఎక్కడయినా ఎవరితోనయినా సంబంధం ఉండి ఉండవచ్చు. డబ్బులకోసం కూడా చేసి ఉండవచ్చు. పూర్తి వివరాలు తెలిస్తేనేగాని ముందుకు వెళ్లలేం" అని ఆగేరు.

ఆమె నిదానానికి, నిశిత పరిజ్ఞానానికి అందరం ఆశ్చర్యపడ్డాం. ఇంతలో మళ్లీ ఆమె చెప్పడం మొదలుపెట్టేరు. ఒక అనాథపిల్లకి చందాలు వేసుకుని ఫీజుకని డబ్బు పోగుచేసి ఇస్తుంటే ఆ పిల్ల కొన్నాళ్లకి వాటితో కాస్మటిక్స్ కొనుక్కుంటూ ఎలా పట్టుపడిందో ఆ వివరాలన్నీ చెప్పడం మొదలుపెట్టేరు.

ఇందాకటి నుంచి గుమ్మం బయట ఒకామె నిలబడి ఉంది. ఆమె చటుక్కున లోపలికి వచ్చింది. సరస్వతిగారి మాటలు పూర్తయేదాకా ఆగింది. ఆగి... "అమ్మా! నిజమే మీరన్నది అలాక్కూడా జరుగుతూ ఉంటుంది. అలాంటి వాళ్లు మీలాంటివాళ్ల నమ్మకాలు పోగొడతారు. మీవంటి దయగల తల్లులు సహాయం చెయ్యడానికి భయపడేలా చేస్తారు. కానీ ఈ అమ్మాయి ఏ అబద్ధం చెప్పనీయండి- 'కడుపు' నిజమేకదా! పనులు చెయ్యలేకపోతున్నాను. పురుడు పోసే దిక్కులేదు. అని 'దాని' కోసం ఆశ్రయం అడుగుతోంది. నేను మధ్యలో వచ్చి ఇలా మాట్లాడకూడదేమో! మన్నించండి. కానీ బయటనిలబడి అంతా విని ఇంక ఉండబట్టలేకపోయాను." అని ఆగింది.

ఆ మనిషివేపు అందరం ఆశ్చర్యంగా చూసేం. ఏభయిఏళ్లు ఉంటాయి. జుట్టు సగం నెరిసింది. బాగా బక్కగా ఉంది. ఒక నేత చీర. చేతులకి ఎర్ర గాజు గాజులు. మెడలో పసుపుతాడు. నల్లపూసలు. మాట మాత్రం ధాటీగానే ఉంది.

"ఎవరమ్మా మీరు? ఎందుకొచ్చేరు?" ఆర్గనైజర్ అడిగేరు.

"నాకెవరూ దిక్కుగా మిగల్లేదుబాబూ! ఉండడం అందరూ ఉన్నారు. నా భర్త మరో ఆడమనిషి చూసుకున్నాడు. పిల్లల్ని అత్తగారూవాళ్లూ తీసేసుకున్నారు. అన్నదమ్ములు ఎన్నాళ్లు చూస్తారు? ఇక్కడ మీరు ఏదో నేర్పి బతుకుతెరువు చూపెడతారని విని ఇక్కడికొచ్చేను. బయటే నిలబడి ఉండిపోయేను. కానీ కడుపుతో ఉన్న ఈ మనిషికే దిక్కులేదు నాకేం ఉంటుంది అని ఆలోచించుకుంటూ ఉండిపోయేను" అంది.

"మీలాగ ఇప్పటికి చాలామంది వచ్చేరమ్మా. మాకు తగిన వార్డెన్ లేక ఎవరినీ చేర్చుకోలేకపోతున్నాం. సంసారం గొడవలైతే సర్దిచెప్పి తిరిగి ఇళ్లకి పంపుతున్నాం. మరో పదిరోజుల్లో కనిపించండి. ఏ సంగతీ చెప్తాం" అన్నారు.

"నేనయితే ఈ పదిరోజులూ కాకపోతే నెలరోజులయినా ఆగుతాను బాబూ! కానీ ఈ పిల్ల ఉత్తిమనిషి కాదుకదా! ఎలాపోయి ఎక్కడుంటుంది?"

"ఆ పిల్ల సంగతి నీకెందుకమ్మా" ఎవరో కసిరేరు.

"ఎందుకేమిటమ్మా! కడుపుతో ఉన్న పిల్ల. దిక్కులేదంటోంది. ఆడకూతుర్ని. ఆ కష్టమేమిటో నాకు తెలుసుగనక"

అందరికీ ఏమో నాకు తెలీదుగానీ నాకు మాత్రం ఛెళ్లున కొట్టినట్టయింది. అంతవరకూ మౌనంగా అంతా గమనిస్తూ ఉన్న పూర్ణకేసి చూసాను. ఆమె అరచేతితో చెంప తడుముకుంటున్నట్టనిపించింది.

"పోనీ మీరు ఒక అవకాశం ఇవ్వండి. నేను పదోతరగతి దాకా చదువుకున్నాను.

మీకు వార్డెన్‌లేరనికదా అంటున్నారు. నన్ను ఆ పనిలో చేర్చుకోండి. ఈ పిల్లకి పురుడుపోసి పంపించే బాధ్యత నేను చెయ్యగలను. ఇంకా ఇలాంటి వాళ్లందరికీ సేవ చేసుకుంటాను. నాకు ఆ అవకాశం ఇవ్వండి" అంటోంది.

బాధిత స్త్రీగా వచ్చి కేర్‌టేకర్‌గా నిలబడతానంటోంది ఈ మామూలు ఆడది, బక్కచిక్కిన నిరుపేద ఆడది. శర్మగారు నవ్వేశారు.

"మీ ఉత్సాహానికి నా అభినందనలు. అంత నిమిషాలమీద జరిగే పనికాదమ్మా ఇది. ఇక్కడ మేం ఏపని చెయ్యాలన్నా చాలామందితో సంప్రదించి చెయ్యాలి. మళ్లీరండి. ఏ విషయమూ చెప్తాం. అమ్మా! మేరీ! నువు కూడా ఓ వారం తర్వాత కనపడు" అన్నారు. మీటింగ్ అయినట్టే. ఎవరి తిన్నవారు లేస్తున్నారు. దుఃఖిత బాధిత స్త్రీల మొహాలు చూసే ఆసక్తి ఎవరికీలేదు. వారం తర్వాత చూద్దాం అన్నాంకదా! మరి!

పూర్ణలేచి నాదగ్గిరకి వచ్చింది. మేరీని, నడివయసామెను రమ్మని బయటి ఆవరణలోకి తీసుకొచ్చేసింది. బయట వర్షం. "వరండాలో నిలబడదాం" అన్నాను.

"వద్దు. ముందు బయటికి పోదాం" అంది.

ఆ పెద్ద ఆవరణ దాటి పెద్ద గేటుదాటి బయటికొచ్చేం. ఆ మూలనించి ఈ మూలకి సాగిన పొడుగాటి రోడ్డు. నాలుగడుగుల దూరంలో దట్టంగా వ్యాపించిన ఆకులకొమ్మల కానుగచెట్టు. ఆ చెట్టుకింద ఆగేం. ఒక్క వానబొట్టు కూడా మామీద పడడంలేదు. ఆకుపచ్చని ఛత్రం. ప్రకృతి దయతో అమర్చిన గొడుగునీడ.

ఎదురుగా వస్తున్న ఖాళీ ఆటోని ఆపి అందులో నలుగురం ఎక్కేం. ఇంటి అడ్రసు చెప్పి "పోనీ" అంది.

** ** **

సహాయం చేసేటప్పుడు ఎమోషనల్‌గానే చెయ్యాలి. లాజిక్ పనికిరాదు. హృదయంతో చెయ్యాలి. బుద్ధి పనిచేస్తే సహాయం చెయ్యలేం. ఒక్కొక్కసారి మోసపోతే పోవచ్చు. అలాగని హృదయాన్ని బంధించుకుని తప్పించుకుపోతే ఎలా?" అంది పూర్ణ ఆ రాత్రి నాతో.

అప్పుడే తన ప్లాన్ చెప్పింది. "మనకి డబ్బుంది. ఎవరికేనా సహాయం చెయ్యాలనే ఆశయం ఉంది. కానీ పనిచేసే మనుషులు లేరు. మనం చెయ్యలేం. ఇందాక మనతో వచ్చినామె ఉంది చూడు. ఆమెపేరు 'రమణ'ట. ఆమెలాంటి మనిషి ఉంటే మనమే చెయ్యవచ్చు ఎన్నో పనులు"

రేపటి నుంచి చెయ్యవలసిన పనులు ప్రణాళికగా వరుసలో పేర్చుకుని ఆ రాత్రి రమణ చేసిపెట్టిన భోజనం తిని సంతోషంతో నిద్రపోయాం.

ఆ మర్నాడు ఎపార్టుమెంట్‌లోని అన్ని ఫ్లాట్లకి వెళ్లి విషయం చెప్పి చేతనయిన సహాయం చెయ్యమని అడిగేం.

ఒక కాపరానికి సరిపడినన్ని సామాన్లు వచ్చి పడ్డాయి. మార్కెట్ 'మాయాబజారు' అయిన పుణ్యమా అని అందరి ఇళ్లలోనూ అక్కర్లేని సామాను చాలా చేరింది. పాత కుర్చీల స్థానంలో కొత్తసోఫాల నుంచి, పాత మూకుళ్ల స్థానంలో కొత్త నాన్‌స్టిక్ పెనాలదాకా. ఆ పాతవి ఎలా వదుల్తాయా అని ఎదురు చూసే గృహిణులకి మేం దేవదూతల్లా కనిపించేం.

వంట సామాను, దుప్పట్లు, చీరలు అన్నీ పోగయ్యాయి. చిల్లరచిల్లరగా డబ్బుకూడా. ఖాళీ ఉన్న చిన్న ఫ్లాట్ అందులోదే అద్దెకి తీసుకున్నాం. పూర్ణదీ మాదీ కూడా ఆ ఎపార్టుమెంటే. రమణకి బాధ్యత అప్పజెప్పేం.

వాళ్లిద్దరికీ కాదు ఇలా జరుగుతుందని, జరపొచ్చని మాకే తెలీదు. జరిగాక వాళ్లకీ మాకూ కూడా ఆశ్చర్యం, ఆనందం కలిగేయి.

మేరీకి నెలలు నిండేయి. మాకు తెలిసిన ఒక లేడీ డాక్టరు ఫీజు తీసుకోకుండా మేరీకి పురుడుపోసి, మందులూ అవీ ఇచ్చేరు. మేరీ అదృష్టం. నార్మల్ డెలివరీ. తెల్లటి పిల్లాడు. పెద్దతరగతి ఇంటికి కొడుకో, వారసుడో కావలసినవాడు. మేరీ సంతోషంగా ఉంది. అలాంటివాళ్లే మరో ఇద్దరు స్త్రీలు చేరేరు.



> మార్కెట్ 'మాయా బజారు' అయిన పుణ్యమా అని అందరి ఇళ్లలోనూ అక్కర్లేని సామాను చాలా చేరింది. పాత కుర్చీల స్థానంలో కొత్తసోఫాల నుంచి, పాతమూకుళ్ల స్థానంలో కొత్త నాన్‌స్టిక్ పెనాలదాకా. ఆ పాతవి ఎలా వదుల్తాయా అని ఎదురుచూసే గృహిణులకి మేం దేవదూతల్లా కనిపించేం.

అన్ని ఫ్లాట్సు వాళ్లూ తరచూ చూసి వెళ్తుంటారు. వాళ్ల యోగక్షేమాలు విచారిస్తుంటారు. ఎవరికి తోచినది వాళ్లు ఇస్తూ ఉన్నారు. అలా ఇవ్వడంలో సంతోషం గ్రహిస్తూ ఉన్నారు. రమణమ్మ అందరికీ సహాయం చెయ్యడంలో కాలం మరచిపోతూ ఉంది. ఇప్పుడు కొంచెం ఒళ్లు చేసింది.

ఎవరెవరికి ఏ ఉపాధి సరిపడుతుందా? ఏ ట్రెనింగ్ ఇప్పిద్దామా! అని నేనూ పూర్ణా ఆలోచిస్తున్నాం.

** ** **

ఇదంతా ఈరోజు వీళ్లకి నేనెందుకు చెప్పాలి? చెప్పను. చెప్పినా సవ్యంగా అర్థం చేసుకోలేరు.

ఇప్పటికీ వీళ్లకి కేర్‌టేకర్ దొరకలేదు. దొరకకపోవచ్చుకూడా. ఈ వ్యవస్థలో ఆర్గనైజేషన్స్ పనిచేయలేవు. పనిచేస్తాయికానీ ఫలితాలు అందవు. ప్రజలే కలిసిమెలిసి పనిచేసుకోవాలి. ఆ ఒక్క విషయం నాకూ, పూర్ణకి అర్థమయినట్టు వీళ్లకి కూడా అర్థం కావాలంటే ఎంతో విలువయినది 'ఒకటి' ఉంది. అది ఎంతో అవసరం అని తెలియాలి. దాని గురించే, దానిగురించి మాత్రమే నేనిక్కడ ఇప్పుడు చెప్పాలనుకున్నాను.

ప్రశ్న ఆయనంత ఆయనే అడిగేడు. "మన హోం తరఫున మనకి ఉండవలసిన ముఖ్య లక్షణం ఏమిటని."

"సేవ- ముఖ్యంగా సమాజసేవ చెయ్యడానికి మనం ఎందుకు ముందుకొస్తున్నామో ఒక్కసారి ఎవరికి వాళ్లం ఆలోచించుకోవాలిసార్. లోకాన్ని మనం ఒక్కళ్లం బాగుచెయ్యలేం. కానీ బాగుచెయ్యాలన్న తపనలో మనలోపలి కల్మషాలు పోవాలి. పోతాయి కూడా. ఎప్పుడంటే- హృదయం పనిచేసినపుడు, హృదయం మాత్రమే పనిచేసినపుడు. మన హోం తరఫున మనలో అది పనిచేస్తోందో లేదో ఎవరికి వారు ప్రశ్నించుకుంటే మంచిది."

ఇంక నేను వాళ్లెవరి ముఖాలూ చూడలేదు. ఒక్క సరస్వతి ముఖంమాత్రం చూడాలనిపించింది. ఆమె కళ్లజోడు తీసేసి నాకేసి చూస్తూ ఉండిపోయింది.

నామాటలతో నాలోపలి ఆవేశం ఒకసెగలా బయటికి వచ్చేసేక ఇక నేను అక్కడ కూర్చోలేకపోయాను.

ఆ విశాలమయిన ఆవరణ దాటి పేద్దగేటు దాటి ఈ కానుగచెట్టు కిందకొచ్చి నిలబడ్డాక ఊపిరి ఆడింది. సతతహరిత ఛత్రం విప్పి కానుగచెట్టు నన్ను సేద తీర్చడమేకాక 'నీడ' ఎలా ఇవ్వాచ్చో చెప్తోంది.

●

## స్వగతం

### ధైర్యంచెప్పిన కన్నవారికి కృతజ్ఞతలు

నాకు చిన్నవయసులో అంటే పదిహేనవ ఏటనే పెళ్ళి జరిగింది. మాది ప్రేమ వివాహం. ఏడవతరగతిలో మా దూరపు బంధువు, మా క్లాసుమేట్ సత్యనారాయణగారితో పరిచయం ప్రేమగా మారింది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో పెళ్ళి చేసుకోవాలని దూరంగా వెళ్ళిపోయాం. పెళ్ళి విషయం ఇంట్లో వాళ్ళకి తెలియజేశాం. తర్వాత పెద్దల సమక్షంలోనే మా పెళ్లి జరిగింది. అప్పటినుండి మమ్మల్నిద్దర్ని మా నాన్నగారే చదివించారు. వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే అయినా ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని మమ్మల్నిద్దర్నీ డిగ్రీ వరకు చదివించారు. నేను డిగ్రీ మొదటి సంవత్సరంలో ఉండగా బాబు పుట్టాడు. దాంతో చదువు ఆపేయాల్సివస్తుందేమో అనుకున్న సమయంలో మా నాన్నగారే ధైర్యం చెప్పి ప్రోత్సహించారు.



లతాసత్యం

నాలుగు నెలల వయసు బాబు సంరక్షణాభారాన్నిఆయనే స్వీకరించారు. డిగ్రీ అయిన తర్వాత మావారికి బి.ఇడిలో సీటు లభించగా నాకు ఎమ్.ఎ.లో సీటు లభించింది. చదువుకుంటూనే ట్యూషన్లు చెప్పుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాం. మా బాబునుకూడా స్కూల్లో చేర్చాం. ఇదంతా మా నాన్నగారి చలువే. మా చదువులు ఆగిపోకుండా మాకు సహకరించి ప్రోత్సహించిన మా తల్లిదండ్రులకు ఎంతో రుణపడి ఉన్నాం. ఇలా ప్రతి ఒక్కరి తల్లిదండ్రులు సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకొనేవిధంగా పిల్లల్ని తీర్చిదిద్దితే ప్రయోజనకర ఫలితాలు లభిస్తాయి.

- లతాసత్యం, రాచాల, మహబూబ్‌నగర్

### స్నేహితుల ప్రోత్సాహంతో మంచిపనిచేశాను

అవి ఐటిఐ చదివే రోజులు. ఒకరోజు మా కాలేజీకి పార్టీవాళ్ళు వచ్చి మన భారత ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయ్ జన్మదినం సందర్భంగా ఎమ్.ఎ.ఎల్.డి కాలేజీలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశామని మా ప్రిన్సిపాల్‌తో విషయం చెప్పి ఆహ్వానించారు. అందుకు మా ప్రిన్సిపాల్ ఆరోజు సెలవు ఇచ్చారు. అప్పుడు నేను మా స్నేహితులతో కలసి అక్కడికి వెళ్ళాను. నన్ను బ్లడ్ డొనేట్ చేయమని స్నేహితులంతా ప్రోత్సహించారు. నాకు కూడా ఓ మంచి పని చేస్తున్నా అన్న భావన నా మనసులో ముద్రించుకుపోయి అందుకు నేను సంసిద్ధుడినయ్యాను. నేను బ్లడ్ డొనేట్ చేసిన తర్వాత నా ఆనందం, తృప్తి వర్ణనాతీతం. తిరిగి కాలేజీకి వచ్చాక విషయం తెలిసిన అందరూ సంతోషించి అభినందించారు. ఆ రోజు నాజీవితంలో ఎప్పటికీ మరిచిపోలేనిది.



రవిప్రసాద్

- జి.రవిప్రసాద్, వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా

### రూపాయితో మొదలైంది చదువు

అది 1953వ సంవత్సరం నాటి మాట. ఆ రోజుల్లో బతుకు దెరువు కోసం మా నాన్న బొంబాయి వెళ్ళాడు. తనతో నన్ను కూడా తీసుకెళ్ళాడు. అప్పుడు నాకు పదేళ్ళు. నేనొక బీడీ ఆకుల దుకాణంలో నెలకు 15రూపాయలకు నౌకరుగా చేరాను. సంవత్సరం గడిచాక తీవ్రంగా జబ్బుపడ్డాను. నాన్న నన్ను తిరిగి పంపారు. అలా వస్తున్నప్పుడు గూట్లో వుండే రూపాయి బిల్లను మా అమ్మమ్మను అడిగి తెచ్చుకున్నాను. ఎందుకంటే ప్రతిరోజు దాన్ని నేను చూసేవాణ్ని. నేను మా ఊరుకు తిరిగి వచ్చేసరికి నా మిత్రులు మెట్‌పల్లి బడిలో చదువుకుంటున్నారు. వాళ్ళను చూశాక నాకూ చదువుకోవాలనిపించింది. అంతే ఆ రూపాయితో పెన్ను కొన్నాను. అది అమ్మకు చూపించి నాల్గవ తరగతిలో చేరాను. ఒక్క రూపాయితో మొదలైన నా చదువు అమ్మకు భారంగా కాకుండా ఆదివారాలు, సెలవుల్లో శ్రమించి ఫీజులు, పుస్తకాలకు ఖర్చుచేసుకొనేవాడిని. నా మిత్రులంతా చదవడం మానేసినా ఒక్కడినే కాలినడకన వెళ్ళివస్తూ పదో తరగతిలో ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాను. 1961లో టీచరునయ్యాను. 1962లో తపాలశాఖలో చేరాను. భవిష్యత్తు మనచేతిలో లేదని నిరాశపడక, ఆత్మవిశ్వాసంతో ప్రతిఒక్కరూ ముందడుగువేయాలి. అప్పుడే జీవితం సఫలమవుతుంది.



నరసయ్య

- వాసాల నరసయ్య, కరీంనగర్